క్లుప్తంగా

నేడు సూరేపల్లి, లోపూడిలో ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం ముసునూరు మండలం సూరేపల్లి, లోపూడిలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించండి



తిరువూరురూరల్: విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి బడి ఈడు పిల్లలను పనులకు పంపవద్దని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని గానుగపాడులో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన పిల్లల తల్లిదండ్రులను కలిసిన ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రసన్న, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్లోపాధ్యాయుడు రాంప్రదీప్ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. చిన్నపిల్లలను దూరప్రాంతాల్లోని ప్రైవేటు కాన్వెంట్లు, కార్పొరేట్ పాఠశాలలకు పంపవద్దని, నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ, సీతా రామ లక్ష్మణ సమేత హనుమాన్ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం తుమ్మలపాలెం గ్రామంలో బుధవారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆడపడుచులను ఆహ్వానించి నూతన వస్త్రాలు బహూకరించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు 4వేల మందికి అన్నదానం చేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ చక్రస్నానం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీచక్రస్నానం, వసంతోత్సవం, చూర్ణోత్సవం తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం నిర్వహించిన పూర్ణాహుతిలో పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. సాయంత్రం పల్లకి ఉత్సవాన్ని జరిపారు. వేణుగోపాలస్వామి, రుక్మిణీదేవి, సత్యభామల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖ కార్యాలయం ప్రారంభం



రెడ్డిగూడెం: మండలంలోని రాఘవాపురం గ్రామంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖ కార్యాలయాన్ని బుధవారం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్లపై అత్యధికంగా వడ్డీ ఇస్తున్నామన్నారు. బ్యాంక్ సేవలను వివరించారు. గుడివాడ రీజనల్ మేనేజర్ శివరామప్రసాద్, విజయవాడ రీజనల్ మేనేజర్ నాయుడు బ్రహ్మయ్య, బ్రాంచ్ మేనేజర్ సందీప్, ఇతర బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



జి.కొండూరు: ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారం జరిగిన సోషల్ పరీక్షతో ముగిశాయి. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం గురువారం సంస్కృతం పరీక్ష ఉన్నప్పటికీ జి.కొండూరు మండల పరిధిలో ఆ పరీక్ష రాసే విద్యార్థులు లేకపోవడంతో బుధవారంతో పరీక్షలు ముగిశాయని అధికారులు తెలిపారు. మండల పరిధిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో చివరి రోజు నిర్వహించిన సోషల్ పరీక్షకు 691మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 666 మంది హాజరయ్యారని చెప్పారు.

మామిడి తోటలపై తెగుళ్ల దాడి

- ప్రకృతి అనుకూలించక రాలుతున్న కాపు
- దిగుబడి కష్టమేనని మామిడి రైతుల దిగాలు
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల చూపు



మేడూరులో కాపు లేని మామిడితోటలు :



లక్ష్మీపురంలో తెగుళ్లు సోకిన మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు (ఫైల్)

తిరువూరు: ప్రకృతి అనుకూలించక ఈ ఏడాది మామిడి తోటలు కాపు లేక వెలవెలబోతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాల మామిడి తోటలుండగా 15 వేల ఎకరాల్లో మాత్రమే సగటు కాపు కనిపిస్తోంది. వాతావరణ మార్పులతో పూత ఆలస్యమై పలు తెగుళ్లు ఆశించాయి. రసాలు, కలెక్టర్ మామిడి రకాలు మాత్రమే కాయగా, బంగినపల్లి రకం ఇంతవరకు ఎదుగుదల లేక చేతికందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా మామిడిపై నల్లితామర, రాతిమంగు, పండు ఈగ, తేనెమంచు పురుగులు ఆశిస్తున్నాయి. ఈ కారణంగా మామిడి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. మామిడికాయలు చూడటానికి నాణ్యమైనవిగా కనిపిస్తున్నా లోపల కుళ్లు తెగులు ఆశిస్తుండటంతో తినేందుకు అవకాశం లేకుండాపోయింది. తెగుళ్లను తట్టుకునే కలెక్టర్ మామిడి సైతం ఈ ఏడాది పలు రకాల తెగుళ్ల బారిన పడి దిగుబడి రావడం లేదని రైతులు చెబుతున్నారు.

గణనీయంగా తగ్గిన దిగుబడి

తిరువూరు, గంపలగూడెం మండలాల్లో 4,500 ఎకరాల మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో 50 శాతం తోటల్లో మాత్రమే కొద్దిపాటి కాపు కనిపిస్తోంది. చంద్రుగూడెం, చీమలపాడు, ఏకొండూరు ప్రాంతాల్లో మామిడి పంట కొనుగోలుకు పందిళ్లు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు విక్రయించడానికి ముందుకు రాక వెలవెలబోతున్నాయి. కలెక్టర్ మామిడి రకం కాయలను ఎదుగుదల లేకపోయినా కోసి విక్రయిస్తున్నారు. దిగుబడి తగ్గడంతో హైదరాబాద్, నున్న మార్కెట్లలో కలెక్టర్ మామిడి టన్ను రూ.40 వేల వరకు ధర పలుకుతోంది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న బంగినపల్లి కాయలు ఇంతవరకు కాపు దశకు చేరలేదు.

పెరిగిన ఖర్చులు

మామిడి తోటల నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరగగా, కాపు లేక తీవ్ర నష్టాలు చవిచూస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఏడాది పొడవునా తోట కాపలాదారులకు జీతాలు చెల్లించడం, సస్యరక్షణ చర్యలకు పురుగుమందులు, ఎరువులు వేయడం, తెగుళ్లను ఎదుర్కొనేందుకు మందులు పిచికారీ చేయడంతో కనీసం ఎకరాకు రూ.25 వేలకు పైగా ఖర్చవుతోందని తెలిపారు. పూత దశ ఆశాజనకంగా ఉన్నప్పటికీ పిందె దశలో పూర్తిగా రాలిపోవడంతో ఈ ఏడాది కనీసం ఖర్చులు కూడా గిట్టుబాటయ్యే అవకాశం లేదంటున్నారు. ఇప్పటికే ముదురు తోటలను, కాపు రాని చెట్లను నరికేస్తున్న రైతులు సుబాబుల్, పామాయిల్, నిమ్మ తోటలను సాగుచేస్తున్నారు. గతంలో ప్రతి మండలంలో 10కి పైగా మామిడి కొనుగోలు కేంద్రాలను ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు ఏర్పాటు చేసి ఇక్కడే మామిడి పంట కొనుగోలు చేసేవారు. ఇప్పుడు కనీస దిగుబడులు కూడా లేకపోవడంతో రైతులే వ్యయప్రయాసలకోర్చి పండిన కొద్దిపాటి కాయలను మినీ వ్యాన్లలో తరలించాల్సి వస్తుండటంతో ధరలు గిట్టుబాటు కావడం లేదు.

ఉద్యానవన శాఖాధికారుల సూచనలు

ప్రస్తుతం మామిడికాయలు గోలీకాయ నుంచి కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నాయని, కాయ పెరిగే దశలో కనీసం 2, 3 తడులు చెట్టుకు అందించాలని ఉద్యానవన అధికారి సోహెల్ అహ్మద్ సూచిస్తున్నారు. కాయ పెరిగే దశలో నత్రజని, పొటాష్ లాంటి పోషకాల అవసరం ఎక్కువగా ఉంటుందని, ప్రతి చెట్టుకు అర కిలో పొటాష్, కిలో యూరియా వేయాలని చెప్పారు. కాయ కోసే నెల రోజుల ముందు నీటి తడులను ఆపివేస్తే కాయ నాణ్యతగా ఉంటుందని, నీటి వసతి లేని తోటల్లో పాలీ ఫీడ్ 20:20:20 రకం 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయపుచ్చు పురుగు నివారణకు థయాక్లోప్రిడ్ (అలంటో)ను ఒక మిల్లీలీటరు లేదా డెల్టామేత్రిన్ ఒక మిల్లీలీటరు వేపనూనెతో కలిపి పిచి కారీ చేయాలని సూచించారు. కాయ పక్వదశలో ఆశించే పండు ఈగ ఉధృతి అరికట్టడానికి లింగాకర్షక బుట్టలను ఎకరాకు ఆరు చొప్పున ఏర్పాటు చేయాలని, కాయలకు కవర్లు తొడిగి ఈ పురుగు బారిన పడకుండా చూసుకోవాలని రైతులకు సూచనలిచ్చారు.

దిగుబడి లేదు



ఏడాది పొడవునా కంటికి రెప్పలా కాపాడుకుంటున్న మామిడి చెట్లకు దిగుబడులు లేకపోవడంతో నిరాశకు గురయ్యాం. గతంలో సగం కాపు నిలబడేది, ఇప్పుడు 20 శాతం కూడా కనిపించట్లేదు. కాయ ఎదుగుదల లేకపోవడంతో చెట్లను నరికేసి ఇతర పంటల సాగుకు ప్రయత్నిస్తున్నాం.

– ఇల్లెందుల కిషోర్, లక్ష్మీపురం

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

జేసీ సంపత్‌కుమార్

మైలవరం: ఎన్నికల నియమావళిని పార్టీల నాయకులు తప్పని సరిగా పాటించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల నాయకులు, ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం కోసం సభలు, సమావేశాల నిర్వహణకు 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, దీని కోసం ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశామని చెప్పారు. పార్టీ కార్యాలయాలపై ఒకే జెండా ఎగరాలని, పార్టీ ఫ్లెక్సీలు 4–8 సైజులో మాత్రమే ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. సభల్లో ఉద్రిక్తత ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడకూడదన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎన్నికల డీటీ ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు అప్పిడి సత్యనారాయణరెడ్డి, డాక్టర్ సహనం, బుద్దారపు వెంకట్రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

నూజివీడు: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించేందుకు అందరూ కంకణబద్ధులు కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ నూజివీడు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం అమర్‌భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు అవకాశవాది అని, మొన్నటి వరకు నరేంద్రమోదీని వ్యతిరేకించి, నేడు మోదీ పంచన చేరారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు మోదీ కట్టబెట్టుతున్నారని, వారి కోసమే ప్రత్యేకమైన చట్టాలను తీసుకువస్తున్నారని విమర్శించారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశం అధోగతిపాలు అవుతుందన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రామారావు, సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి

ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

పుల్లూరు(మైలవరం): వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి అన్నారు. పుల్లూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం బుధవారం రాత్రి జరిగింది. అప్పిడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మనలో ఒకడు, సామాన్యుడైన మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సర్నాల తిరుపతిరావును, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించుకోవాలన్నారు. తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని చెప్పారు. ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగుతాయన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుల్లూరు సొసైటీ అధ్యక్షుడు చిలుకూరి రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలోని మామిడి తోటలను హార్టికల్చర్ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జి శాలిరాజు, హార్టికల్చర్ అధికారి బొమ్మిన నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎ.కొండూరు, జి.కొండూరు మండలాల్లోని మామిడి తోటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. గతంలో రైతు సంఘ నాయకులు పీవీ ఆంజనేయులు, ఎం. మాధవరెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి పరిసర ప్రాంతాల్లోని మామిడి తోటల పరిస్థితి వివరించి సమస్య పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం సమర్పించారన్నారు. స్పందించిన కలెక్టర్ ఈ బృందాన్ని పంపించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

- **ఏ.కొండూరు:** మండంలోని రామచంద్రాపురం, చీమలపాడు, ఏ.కొండూరు, రేపూడి, మాధవరం గ్రామాల్లోని మామిడి తోటలను బుధవారం ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ మామిడి తోటల్లో తామర పురుగు, నల్లతామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. తామర పురుగు ఉధృతిని సమగ్ర యాజమాన్య పద్ధతి ద్వారా నివారించాలని, ఒక్కొక్క చెట్టుకు నాలుగు కేజీల వేప పిండిని వేయాలని, నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 50 ఏర్పాటు చేయాలన్నారు. పూత ప్రారంభ దశలో వేపనూనె లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గానుగ నూనె ఒక లీటరు నీటికి రెండు ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని, రసాయన పద్ధతిలో ఇమిడాక్లోప్రిడ్ మూడు మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

మామిడి తోటల పరిశీలన..

కొండపర్వ(విస్సన్నపేట): మామిడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వలన నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త జి. శాలిరాజు అన్నారు. బుధవారం కొండపర్వ గ్రామంలో హెచ్ఓ నరేంద్రకుమార్‌తో కలిసి శాస్త్రవేత్త శాలిరాజు మామిడితోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. మామిడిలో తామర పురుగు, నల్ల తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని చెప్పారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం

తిరువూరు: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని తిరువూరు కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్వామి అయ్యప్ప దేవాలయం ఆవరణలో బుధవారం నిర్వహించారు. పౌరాణిక నాటకాల్లోని పద్యాలు ఆలపిస్తూ కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. దివంగత రంగస్థల కళాకారుడు బుర్రా రామ్మూర్తి తదితరులకు నివాళులర్పించారు. కళాకారులు ఎంపీ సుబ్బారావు, రామవరపు నరసింహారావు, బీమాల రామారావు, నండూరి నరసరాజు, రామవరపు ప్రసాద్, కృష్ణారెడ్డి, ఉషాకిరణ్ శ్రీనివాస్, వేముల వెంకటేశ్వరరావు, పాతకొట్టు మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆగిరిపల్లి: సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలని ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి కోరారు. బుధవారం ఆగిరిపల్లి 9వ వార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గెలుపు నల్లేరుపై నడకే అని, అత్యధిక మెజార్టీ లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నక్కనబోయిన పండు, గ్రామ పార్టీ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు, వాకా సక్కేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



మైలవరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు

మైలవరం: విశ్వాసులు తమలోని దుర్గుణాలను త్యజించి క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని రెవరెండ్ ఫాదర్ బి. విజయరాజు అన్నారు. మైలవరం ఆర్‌సీఎం సంఘ విచారణ దేవాలయం (శాంతినగర్) నుంచి 16 సంఘాల కథోలిక్ విశ్వాసులు జపమాల ప్రార్థనలు, భక్తి గీతాలు ఆలపిస్తూ విచారణ పరిధిలోని చెవుటూరు కథోలిక్ సంఘంలోని కలువరి గట్టు వద్దకు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ విజయరాజు మాట్లాడుతూ ఏసు క్రీస్తు తనను తాను తగ్గించుకుని సిలువను మోసి ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ పశ్చాతాపపడి, పాప మన్నింపు, పరివర్తన కలిగి నూతన జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ సిస్టర్స్, ఉపదేశకులు, దీక్షాపరులు, మరియ దళ సభ్యులు, మదర్ థెరిస్సా యూత్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం చెవుటూరులో అన్నాదానం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

మైలవరం: మైలవరం తారకరామా నగర్‌లో నాలుగో సచివాలయం పరిధిలో గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్న నక్కబోయిన ఎస్తేరురాణి అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక నాయకులు వలంటీర్ కుటుంబ పెద్దకు తమ వంతు ఆర్థిక సహాయంగా రూ.20 వేలను బుధవారం అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ చామల సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, 13, 14వ వార్డు సభ్యులు వహీదా బేగం, యర్రగోపుల రాధిక, ఎంపీటీసీ సాగ సీతమ్మ, కోడూరు జగదీష్ తదితరులు ఉన్నారు.

- **ఏ.కొండూరు:** మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన పోలిశెట్టిపాడు పీఏసీఎస్ సభ్యురాలు ఎం. సుగుణమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబానికి పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి మట్టి ఖర్చుల కింద రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ మేనేజర్ టి. ఉషజ్యోతి, సీతాట కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ ఎన్‌వీ సుబ్బారావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవవేతనం ఇస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లా చరణ్

నూజివీడు: పాస్టర్లకు గౌరవవేతనం ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ అన్నారు. మండలంలోని బత్తులవారిగూడెంలో షెకేము పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికను బుధవారం నిర్వహించారు. చరణ్ మాట్లాడుతూ దైవ సేవకులకు గుర్తింపు తెచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. ఈ అసోసియేషన్ 2005లో ప్రారంభమైన నాటి నుంచి ఏ ఇబ్బంది వచ్చినా, అవసరం వచ్చినా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పందించి పరిష్కరించేవారన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ ప్రతాప్ అప్పారావుకు మద్దతు పలకాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా జేఆర్ సుశీలరావు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.ఏసుపాదం, ఉపాధ్యక్షులుగా బీవీ భాస్కరరావు, పి. దైవప్రసాద్, సెక్రటరీగా పి. మోషే, జి. డేవిడ్‌రాజు, బి. రవికుమార్, జి. మోజెస్, కోశాధికారిగా టీవీ ప్రసాద్, ఈసీ సభ్యులుగా సుగుణరావు, ఏసుపాదం, ఎలీషా ఎన్నికయ్యారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సోషల్ పరీక్షకు మండలంలో 26 మంది గైర్హాజరు

మైలవరం: మైలవరంలో మండలంలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు బుధవారం 26 మంది రెగ్యులర్ విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ ఎల్. బాలు తెలిపారు. బుధవారం సోషల్ స్టడీస్ పరీక్ష జరిగిందని, రెగ్యులర్ విద్యార్థులు 1,101 మందికి గాను 1,075 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అదేవిధంగా 79 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 26 మంది విద్యార్థులు హాజరు కాగా 53 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

- **నూజివీడు:** పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని 17 పరీక్ష కేంద్రాల్లో బుధవారం సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించారు. మొత్తం విద్యార్థులు 3,585 మందికి గాను 3,331 మంది విద్యార్థులు హాజరు కాగా, 254 మంది గైర్హాజరయ్యారు. నూజివీడు పట్టణంతో పాటు మండలంలో కలిపి 9 పరీక్ష కేంద్రాల్లో 1,917 మందికి గాను 121 మంది గైర్హాజరవ్వడంతో 1,796 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 382 మందికి గాను 31 మంది గైర్హాజరవ్వగా 351 మంది, ముసునూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 638 మందికి గాను 52 మంది గైర్హాజరవ్వగా 586 మంది, ఆగిరిపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 648 మందికి గాను 50మంది గైర్హాజరవ్వడంతో 598 మంది హాజరయ్యారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నూజివీడు: మిట్టగూడెంలో శ్రీనవ ఆంజనేయ సహిత సీతారామ ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేస్తామని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం 8.09 గంటలకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. అనంతరం 11.30 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

గేట్ ఫలితాల్లో ఎల్‌బీఆర్‌సీఈ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు

మైలవరం: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) అర్హత పరీక్షల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి 40 మంది ఆల్ ఇండియాలో మెరుగైన ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు బుధవారం తెలిపారు. ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థిని కూరపాటి రూబి 160వ ర్యాంక్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి ఎం. సుకుమార్ 620వ ర్యాంక్ పొందారన్నారు. మొత్తం వెయ్యి లోపు ర్యాంకులను ఏడుగురు విద్యార్థులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

చంద్రాలలో ఐడీబీఐ శాఖ కార్యాలయం ప్రారంభం



ఐడీబీఐ శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వేణుగోపాల్, సాయి హరికృష్ణ, సుధాకర్

చంద్రాల(మైలవరం): ఐడీబీఐ బ్యాంక్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింపజేయడం అభినందనీయమని సాయి కిరణ్ డెవలపర్స్ మేనేజింగ్ చైర్మన్ నూతక్కి వేణుగోపాల్ అన్నారు. ఐడీబీఐ బ్యాంక్ మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఏర్పాటు చేసిన 36 శాఖను బుధవారం నూతక్కి వేణుగోపాల్ ప్రారంభించి మాట్లాడారు. బ్యాంక్ సేవలను మరిన్ని గ్రామాలకు విస్తరింపజేయాలని, అన్నిరకాల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఐడీబీఐ సీనియర్ జనరల్ మేనేజర్ సాయి హరికృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఆపరేషనల్ మేనేజర్ సుధాకర్, బ్రాంచ్ మేనేజర్ బంగార్రాజు, క్యాషియర్ భరత్, సాయి కిరణ్ డెవలపర్స్ పార్టనర్ పాలడుగు రాజా ప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

నేడు రామాలయం ప్రతిష్ఠా మహోత్సవం

నూజివీడు: వెంకటాయపాలెంలో గురువారం శ్రీ విజయ కోదండ రామాలయ నూతన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని కోదండ రామాలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం 9.40 గంటలకు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభ సంప్రోక్షణ మహోత్సవం అనంతరం అన్నదానం జరుగుతుందని చెప్పారు.

సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి

తిరువూరు: తిరువూరులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సబ్ కోర్టు ఏర్పాటుకు తాము కృషి చేస్తామని తిరువూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకదాని లక్ష్మీనారాయణ, గౌసుద్దీన్ అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కక్షిదారులకు అందుబాటులో ఉండేలా తిరువూరులో సబ్ కోర్టు ఏర్పాటు ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించేందుకు తగు కృషి చేస్తామని చెప్పారు.

రామాలయం హుండీ కానుకల లెక్కింపు

చాట్రాయి: చనుబండ కోదండ రామాలయం హుండీ కానుకలను దేవదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. మూడేళ్లకుగాను రూ.1.35 లక్షల ఆదాయం లభించిందని సుధాకర్ తెలిపారు.